
కథ

# కీటకం

– బలభద్రపాత్రుని రమణి

అర్ధరాత్రి దాటుతోంది. అతనింకా రాలేదు. నేను ఈ ఎదురు చూపు భరించలేక పోతున్నాను. ఒక రోజంటే ఫరవాలేదు. కానీ ప్రతిరోజూ ఇంత ఆత్రంగా ఎదురు చూడడం అంటే నరకమే!



కిటికీ కర్టెన్ తొలగించి రోడ్డువైపు చూస్తూ ఏ వాహనం తాలూకు లైట్లు కనిపించినా అనగా... అది నా ఇల్లు దాటిపోగానే నిరాశగా..ఇలా ఎంత కాలం? టిక్...టిక్...మనే గడియారం మాత్రమే నాకు తోడుగా వుంది. కళ్లు మండిపోతున్నాయి. అంతకన్నా ఎక్కువగా మనసు మండిపోతుంది! అక్కడ హాయిగా అతను ఆవిడ పక్కన ఆదమరచి నిద్రపోతున్నాడేమో! రేపు ప్రొద్దుట ఫోన్‌చేసి 'సారీ డియర్...రాత్రి అసలు ఇంటికే రాలేదు' అనే కాక్ అండ్ బుల్ స్టోరీస్ చెప్తాడు. అనే వూహ రాగానే ఇంక మనసు నిలువుకోలేకపోయాను.



గబగబా వెళ్లి అతని ఇంటికి డయల్ చేశాను. రింగ్ అవుతోంది. లిఫ్ట్ చెయ్యడం లేదు! నాలో అసహనం, వుక్రోషం కట్టలు తెచ్చుకొంటున్నాయి. ఇంతలో లిఫ్ట్ చేసి "హలో" అంది. ఆవిడ స్వరం చాలా కటువుగా వుంది.

నేను క్రెడిల్ చేసేశాను.

'ఏం చెప్తాను? మీ ఆయన నా దగ్గరకు ఇంకా రాలేదెందుకు?' అని అడగగలనా! అందుకే పెట్టేశాను.

సోఫాలో వెనక్కి వాలి ఫ్యాన్ వైపు చూస్తూ కూర్చున్నాను. ఆనంద్ నాకు పరిచయం అవడం గుర్తొస్తోంది. ఊహ వచ్చినప్పటి నుండీ పిచ్చిగా ఆరాధిస్తున్న నా అభిమాన గాయకుడు నాకు హఠాత్తుగా ఓ రోజున పరిచయం అవుతాడనీ, నా జీవిత గమనాన్నే మార్చి వేస్తాడనీ నేను వూహించనే లేదు! కానీ అదే జరిగింది.

టీ.వీ.లో జరిగే ఓ పాటల కార్యక్రమంలో నేను పాల్గొనడం, ఆ పోటీకి ఆనంద్ జడ్జిగా రావడం...నా ఆరాధనంతా నేను మనసులోంచి చూపులతో తోడి అతని మీద గుమ్మరించడం...అది అతను ఇట్టే పట్టేయడం...అంతా నా ప్రమేయం లేకుండానే జరిగిపోయింది!

ఆటోగ్రాఫ్ చెరిగిపోకుండా నా మనసు మీద చేసేశాను. ఫోన్ నెంబర్ అడిగితే నన్ను తమాషాగా ఆట పట్టిస్తాడనుకున్నాను. కానీ నిజంగా ఓ రాత్రి ఫోన్ చేసినప్పుడూ, 'తెలివి రానీకే కల కరిగిపోతాది, ఒక్క నేనే నీకు, పెక్కు నీవులు నాకు' అని రాత్రిని కరిగించేసినప్పుడూ నమ్మలేకపోయాను.

ఆ తర్వాత...అతను నన్ను మొదటిసారి ఎప్పుడు ముట్టుకున్నాడో...పూర్తిగా నన్ను నేను ఎప్పుడు అర్పించుకున్నానో గుర్తు లేదు! అది జన్మ జన్మల బంధం అని నా నమ్మకం. నా నమ్మకాన్ని ఇంట్లో అమ్మా నాన్నలు నమ్మలేదు. మా సంబంధం బయటపడి పెద్ద గొడవైంది.

మా అలౌకికమైన ప్రేమని అర్థం చేసుకోలేని సమాజం లోని వాళ్లంతా నాకు పేడ పురుగుల్లా కనిపించారు.

ఇల్లు వదిలి బయటికొచ్చేసి ఒంటరిగా వుండసాగాను.

ఆనంద్ నాకు ఏమీ కొరత చెయ్యలేదు. చాలా బాగా చూసుకున్నాడు. క్యాసెట్స్ చేయించాడు. తను మ్యూజిక్ డైరెక్షన్ చేస్తున్న సినిమాల్లో పాడే ఛాన్స్ ఇప్పించాడు. డబ్బూ...హోదా...వాటిని మించిన సుఖం అందించాడు.

అతని టచ్‌లో మేజిక్ స్టైల్ వుంది! ఈ ఒంటరితనం భరించలేక అలిగి, పోట్లాడి దూరంగా వుందామన్నా అతని చేయి తాకగానే నా శరీరం నా మాట వినడం మానేస్తుంది. మా రెండు శరీరాల మధ్యనున్న 'ecstacy' మాటల కందని భావన!

మాధవి అతని భార్య. ఆవిడ మాకు అడ్డని నేను ఎప్పుడూ భావించలేదు. కానీ ఈ మధ్యన తరచూ అతను రానప్పుడు నాలో ఈర్ష్య బుసలు కొడ్తోందని నేను గమనిస్తున్నాను. వారంలో మూడు రోజులు మాత్రమే అతన్ని పంచుకోవడం నాకు జీర్ణం కాని సమస్యగా మారింది!

తెల్లవారిపోతోంది...నా కన్నీళ్లు మెడ క్రిందుగా జారుతూ పైటని తడిపేస్తున్నాయి. అందర్నీ ఒదులుకుని ఈ విశాలమైన నిశీధిలో బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా కాలాన్ని కొలుస్తూ కూర్చోవడం నా గుండెని గండి పడేట్లు చేస్తోంది.

హారన్ వినిపించింది!

చటుక్కున కళ్లు తుడుచుకొని, ఒక్క అంగలో కిటికీ దగ్గరకెళ్లి చూశాను.

గేట్‌లోంచి అతని కార్ వస్తూ కనిపించింది.

డోర్ బెల్ కోసం వూపిరి బిగబట్టి నిరీక్షించాను. అది మ్రోగగానే హృదయం ఆనందంతో చిందులేసింది. తలుపు తెరిచి అమాంతం అతన్ని చుట్టేసుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. నేను ఇంత సేపు అనుభవించిన వేదన వర్ణించడానికి నాకు అంతకన్నా వేరొక ప్రక్రియ రాదు మరి!

ఆనంద్ నన్ను పసిపిల్లని పొదివి పట్టుకున్నట్లు పట్టుకుని గదిలోకి తీసుకెళ్లాడు.

"ప్రొద్దుట్నుండీ హెవీ వర్క్.. డైరెక్ట్‌గా రికార్డింగ్ నుంచి ఇటే వస్తున్నాను. ఆకలేస్తోంది. తినడానికేమైనా వుందా?" అన్నాడు.

నాకు బాధా, ఆనందం ఒకేసారి కలిగాయి.

"ఇంటి నుంచి కాదా?" మెరుస్తున్న కళ్లతో అడిగాను.

అతను తల అడ్డంగా వూపి "ఇంట్లో ఏవుంది? ఆవిడ ఎప్పుడో హాయిగా నిద్రపోయి వుంటుంది. తనకి నగలూ, చీరలూ, సినిమాలూ తప్ప నా ఆనందం, సౌఖ్యం అనవసరం. నాకై ఎదురుచూసే వాళ్లు ఎక్కడుంటే అదే నా ఇల్లు!" అన్నాడు.

"ఆనంద్! ఐ లవ్ యూ!" అంటూ అతన్ని ముద్దాడాను. "ఉండు...భోజనం తెస్తాను" అని పరిగెత్తాను.

అతను భోజనం చేశాకా, నన్ను దగ్గరికి తీసుకుని "యూ ఆర్ మై ఏంజిల్" అన్నాడు.

"నీకు దూరంగా వుండలేకపోతున్నాను ఆనంద్. నన్ను విడిచి వెళ్లకు...ప్లీజ్!" అన్నాను.

ఆనంద్ మాట్లాడలేదు. నన్ను కూడా మా[illegible] నివ్వలేదు! ఆ తర్వాత ప్రతిరాత్రీ ఇక్కడే గడపసాగాడు.

'మిసెస్ ఆనంద్' అన్న పదవిలో మాత్రం మాధవి కొనసాగుతోంది. లోకానికంతా అతని ఎడ్రెస్ మారిన సంగతి తెలిసిపోయింది.

నాలో మళ్లీ ఏదో అనిశ్చిత భావం. సతమతమైపోతూ "ఆనంద్...సొసైటీలో నా స్థానం ఏవిటి? ఇప్పటికే రెండుసార్లు అబార్షనయ్యాయి!" అన్నాను.

ఆనంద్ మామూలుగా తీసుకుంటూ "మాధవితో మాట్లాడ్తాను. డైవోర్స్‌కి పెద్ద అభ్యంతరం చెప్పదనుకుంటా" అన్నాడు.

"డైవోర్స్!" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ...నీకు మేరేజ్ కావాలి, అంతే కదా!" అన్నాడు.

నేను మరోసారి అతని పట్ల కృతజ్ఞతతో కరిగిపోయాను.

ఆ తర్వాత చాలా గొడవలయ్యాయి. మాధవి తండ్రీ, అన్నలూ వచ్చి నన్ను అనరాని మాటలన్నారు.

ఆనంద్ వాళ్లని "గెట్ అవుట్" అన్నాడు.

లాయర్‌కి చాలా ముట్ట జెప్పాల్సి వచ్చింది. నా నగలూ, ఫిక్స్‌డ్‌లో వున్న డబ్బూ హరించుకుపోయాయి. అయితేనేం...ఆయన మాధవి చేత డైవోర్స్‌కి ఒప్పించాడు. ఆనంద్ కన్నా నాకు ఏవీ ఎక్కువ కాదు!

మా ఇద్దరికీ రిజిస్టర్ ఆఫీసులో పెళ్లైంది. జీవితంలో నేను కోరుకున్నది సాధించాను. బ్రతుకే ఓ పాటగా గడిచిపోతోంది. కానీ మధ్య మధ్యలో ఆనంద్ చిరాకూ, నా మీద అనవసరంగా అలిగి అరవడం అపశృతుల్లా వున్నాయి!

మా పెళ్లయి రెండేళ్లు గడిచాయి. ఇప్పుడు నాకు బాబీ కూడా తోడయ్యాడు. "డాడీ...రాలేదా?" అంటూ ఆనంద్ కోసం ఎదురు చూడటానికి!

బాబీ పుట్టాకా ఆనంద్ మీద నించి నా శ్రద్ధ కొంత డైవర్ట్ అయింది. పాట అనేది పూర్తిగా మరిచిపోయాను.

"ఆనంద్ గారి మిసెస్‌కి తలుచుకొంటే అవకాశాలు కొదవా?" అంటారు తెలిసినవాళ్లు. కానీ ఆనంద్ మాత్రం నన్ను ఎంకరేజ్ చెయ్యడం మానేశాడు.

ప్రస్తుతం 'నిషా' అనే పిల్లని చాలా ఎంకరేజ్ చేస్తున్నాడనీ, ఎప్పుడూ ఆమె అతని పక్కనే వుంటోందనీ పుకారు బయలుదేరింది. అది తెలిసి నేను చాలా కళవెళ పడ్డాను. నిలేసి అడుగుదామంటే అతను అర్థరాత్రి దాటాకా వచ్చి, తెల్లవారి లేవగానే బిజీగా వెళ్లిపోతున్నాడు.

మళ్లీ కథ మొదటికొచ్చింది.



## రెచ్చగొట్టే దృశ్యాలు

కేవలం సీన్లు చూడ్డానికి సినిమాకెళ్ళే జనం కోసం తప్పనిసరిగా హీరోయిన్ల ఎత్తువల్లాలని చూపించే సీన్లు పెట్టాల్సి వస్తోందని అంటున్నారు దర్శక నిర్మాతలు. అలాగే ఫిరోజ్ ఖాన్ కొడుకు ఫర్‌దీన్ ఖాన్ సినిమా 'ప్రేమ్ అగ్గన్'లో హీరోయిన్ మేఘనా కొఠారితో చేసిన ముద్దు సీన్ చూడడానికి కుర్రకారుతో పెద్దకారు కూడా థియేటర్ల ముందు క్యూలో నిలబడుతున్నారు.

ప్రతిరాత్రీ అతని కోసం ఎదురు చూడటంలో నాకు రాత్రులు కరిగి పోతున్నాయి.

ఒకరోజు రాగానే పట్టుకుని "నేను విన్నదంతా నిజమేనా?" అని దులిపేశాను.

ఆనంద్ నిర్లక్ష్యంగా "ఆలస్యంగానైనా వస్తున్నందుకు సంతోషించు...ఇంటికి రాగానే వెధవ న్యూసెన్స్. ఎవడికైనా రాబుద్ధి అవుతుందా?" అన్నాడు.

నేను మ్రాన్పడిపోయాను.

నాకు మాధవి గురించి అతను చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. బహుశా నిషా వడిలో తల దాచుకొని "నాకు ఇంట్లో సుఖం, శాంతీ లేవు! ఎప్పుడూ తనకి పిల్లాడు, తన ఆనందం తప్ప నా మనశ్శాంతి గురించి పట్టదు!" అని చెప్తుంటాడు అనిపించింది!

ఆనంద్ మొండివాడు. ఏం మాట్లాడితే సాగదీసి తెంపేస్తాడో అని భయంవేసి నోర్మూసుకొని వుండిపోయాను.

అతను ఇప్పుడు రాత్రులు నిషా ఇంట్లోనే గడుపుతున్నాడు. నెలకి ఒకసారి ఎప్పుడైనా కనిపిస్తాడు.

## మీనా ఊపు

ఇటు తెలుగు అటు తమిళంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న మీనా దాదాపుగా పెద్దా, చిన్నా హీరోలందరితోనూ నటించింది. ఇక ఇప్పుడు ట్రెండు మార్చి తన గుండ్రటి మోకాళ్ళు, నునుపైన తొడలు ప్రదర్శించడంలో [illegible] మించిపోతోంది. అంటే బాలీవుడ్‌ని కూడా ఓ వూపు ఊపాలని నిర్ణయించుకుందన్నమాట!



జరుగుబాటుకి నేనూ ఓ చిన్న వుద్యోగం చూసుకున్నాను.

అతను వచ్చినప్పుడల్లా వూపిరి బిగబట్టి విడాకుల పత్రాల మీద సంతకం అడుగుతాడేమోనని ఎదురు చూస్తున్నాను. అతను అడగడం లేదు. అంటే అవతలవైపు నుండి ఒత్తిడి లేదన్నమాట! అందుకు నిషాకు థాంక్స్ చెప్పకున్నాను.

రోజులు గడుస్తున్నాయి. నా బ్రతుకు నిస్సారంగా అతని రాకకై ఎదురుచూస్తూ మోడైపోతోంది.

నిషా టాప్ సింగర్ అయింది. ఇద్దరూ దేశవిదేశాల్లో ప్రోగ్రామ్స్ ఇస్తూ తిరుగుతున్నట్లు తెలిసింది.

ఇప్పుడు అర్థమౌతోంది నిషా ఎంత తెలివి గలదో! భార్యా భర్త మధ్యన మూడో వ్యక్తిగా వున్నంత కాలం నేను అనుభవించే ఈ నరకం వుండదు. 'రైట్' పొందాకే మన వస్తువు ఎవరో లాగేసుకుంటే మహావేదన! అది లేకపోతే అతను భార్యా బిడ్డల్ని వదిలి మన చుట్టూ వెంపర్లాడుతూ తిరగడం ఓ 'థ్రిల్! '

నిషా నాలా తెలివి తక్కువగా ఆనంద్ భార్య స్థానం లోకి రాలేదు. అతని మనస్తత్వాన్ని తెలివిగా క్యాష్ చేసుకుంది! మూడవ వ్యక్తి స్థానంలో అన్ని రకాల ఆనందాలూ పొందుతోంది. ఆనంద్‌ది కీటక మనస్తత్వం. కొత్తపువ్వు చుట్టూ తిరుగుతుంటాడు.

నేను అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల ఇలా ఒంటరిగా ఎదురుచూస్తూ కూర్చున్నాను.

ఈ మధ్య కళ్లు మూస్తే మాధవి నన్ను చూసి పకపకా నవ్వుతున్నట్లు ఒకటే పీడ కలలొస్తున్నాయి!

పాపం మాధవి ఒకప్పుడు ఇలాగే నా స్థానంలో... కాదు, కాదు! పాపం నేను!!!